మరో మూడు రోజుల్లో చనిపోయేలా కనిపించింది. పదమూడేళ్లు దాటిన నలుగురు మగపిల్లలు, అప్పుడే ఓణీలు వేస్తున్న ఒక ఆడపిల్ల బయట కూర్చుని ఏవో పనులు చేసుకుంటూ కనిపించారు. ఆ ముగ్గురు మగవాళ్ళలో ఒకతనికి ఒక కాలు లేదు.

వాళ్ళు ఉన్న స్థితి చూస్తే నాకు కళ్ళు తిరిగాయి. వీళ్ళందరినీ ఆమె పోషించాలేమో అనుకున్నాను.

ఆరాత్రి నాకు భోజనం సయించలేదు.

అప్పుడు ఆమె చేస్తున్న పనేమిటో నాకు సులభంగానే అర్థమయింది.

ఒళ్ళమ్ముకుంటూంది.

మన దేశంలో ఆడది తను బ్రతకటానికయినా పదిమందిని బ్రతికించటానికయినా అదేకదా పెట్టుబడిలేని వ్యాపారం.

నా అంచనా సరయినదేనని ఆ మరుసటిరోజున తెలిసింది.

సాయంత్రం నేను, సుబ్బరాజు సెంటర్లో నిలబడి ఉన్నాం. సరిగ్గా ఒక రిక్షాలో మా ముందునించి వెళుతూ కనిపించింది రాణి... ఆమెన్ను వాడికి చూపించి "నీకు తెలుసా ఆమె?" అడిగాను.

"అది నాకెందుకు తెలియదు? రాణి అని ఒక పెద్ద హేండ్... డామ్ చీప్... నైటుకి ఇరవై" అన్నాడు.

సుబ్బరాజు చెప్పింది నిజమే అయినా నాకెందుకో ఆ మాటలు వినడం బాధనిపించింది.

ఆ తరువాత ఆమె అనుకోకుండా బస్సుడిపో దగ్గర రాత్రివేళ కనిపించింది... ఒక ఫ్రెండుని బస్సు ఎక్కించి వస్తున్నాను... ఆమె ఎక్కడినుంచి వస్తోందో...

గబగబా నడిచొస్తోంది.

నేనూ అంతే వేగంగా నడిచి ఆమెను కలుసుకున్నాను. రోడ్డు వారగా ఆగి ఉన్న రిక్షా దగ్గరకు వెళ్ళబోతూంది.

"ఏమండీ" పిలిచాను.

వెనక్కు తిరిగింది.

ఏమిటన్నట్టు చూసింది.

పక్కన నడుస్తూ అడిగాను– "నేను మీకు గుర్తున్నానా?"

"గుర్తున్నారు– ఒక పెళ్ళిలో కలిశాం" చిన్నగా అంది.

ఆమె అలా అన్నందుకు నాకు చాలా సంతోషమయింది.

తరవాత ఏమి మాట్లాడాలో నాకు తెలీలేదు. ఎన్నో వివరాలు అడుగుదామనుకున్నాను. కాని నాకు మాట పెగలి రాలేదు.

పాంటు జేబులోనించి పర్సు బయటకు తీశాను. అందులోని యాభై రూపాయల

